ఆస్తి కోసం

శ్రీ వి. కె. దాసరి

(విమల ప్రవేశిస్తుంది)

విమల:-అమ్మాయ్ జయా...!

జయ:-ఆఁ...

వి:-బైట తలుపు వేసిరా...

జ:-ఎందుకే —

వి:-(గట్టిగా) నీక్కాదూ చెప్పేది - వేసిరమ్మంటే —

జ:-అబ్బ - చెప్పవే యెందుకో -

వి:-ముందు వేసిరా. మేడమీదనించి మీతాతయ్య బీరువా, గడియారం...కిందికి దింపాలి. బహుశా మీ పెద్దమ్మ వాళ్లు రావచ్చు — పో —

జ:-తాతయ్య సామాన్లెందుకే కిందికి తేవడం —

వి:-ష్. నోర్ముయ్!

జ:-సరే. (తలుపు వేసిన శబ్దం)

(విమల సామాన్లు సర్దుతున్న చప్పుడు)

వి:-జయా

జ:-ఆఁ... (వస్తుంది)

వి:-ముందు నువ్వు కట్టుకున్న ఆ పూలగౌనూ, పరికిణీ విప్పి పాతవి కట్టుకో — పో.

జ:-ఎందుకే —

వి:-తాతయ్య చచ్చిపోయాడుకదూ — అందుకని.

జ:-అందుకని —

వి:-ఔనే తల్లి! నీకు సమాధానం చెప్పటానికి ఆ బ్రహ్మదేవుడు దిగిరావాలి...

జ:-అయితే దిగివచ్చిందాకా ఆగుదాం. అయినా బ్రహ్మదేముడు యిప్పట్లో ఎక్కడొస్తాడులే.

వి.-ఏడిశావులే. వెధవ వేళాకోళం నువ్వూనూ. ముందు అవి విప్పి ఆ పాతగౌనూ, లంగా తొడుక్కురా పో...

(వీధి తలుపు తట్టిన శబ్దం)

వి: తొందరగా నువ్వు లోపలికిపో. నే తలుపుతీసి చూస్తాను.

(విమల తలుపు తియ్యడానికి పోతూ తిన్నగా జయతో విసురుగా ''లోపలికి పోవేమే'' అని నోరు నొక్కుకుంటుంది. తలుపు తీసిన శబ్దం — భర్త రామారావు లోనికి వచ్చిన చప్పుడు.)

వి:-మీరా నేను వాళ్లేమో అనుకున్నా.

రామా:-అబ్బే - నేనసలు రైలు స్టేషన్కే పోక పోతేను ...

వి: చూడండి. ఇందాకనుంచి దీనికి చెప్పటం — లక్ష్యంవుంటేనా! ఆ బట్టలు మార్చి పాతవి తొడుక్కునుండవే అంటుంటే...

(అని వెళ్లి ఒక్క చరుపు చరుస్తుంది. కూతురు జయ లోనికి ఏడుస్తూ పోయిన శబ్దం)

రా:-(విసురుగా) ఎందుకే దాన్నలా చితక్కొడతావ్. చెప్పేదేదో తిన్నగా చెప్పరాదూ.

వి:-ఏం తిన్నగానండీ...అబ్బా కూతురూ ఒక్కటై .. ఇందాకణ్ణుంచి వాగిందాన్ని వాగినట్టుంటే! మీ గారాబం మరీ జాస్తయి పోయింది. గారా

బం గజ్జలుకడితే వీపు దెబ్బలకేడుస్తుంది — మరి!

రా:-చాల్చాల్లే వూరుకో. ఇంతకీ వాళ్లొస్తే ఏం చెప్పాలో ఆలోచించావా!

వి:-(తొందర తొందరగా) ముందు మేడమీదకి పదండి — మానాన్న గదిలోకి - ఆ బీరువాలు, బల్లలు కిందకి తేవాలి.

రా:-అవెందుకే యిప్పుడు......

వి:-వాళ్లొస్తే వాటాగీటా పంచాలంటారు. అందుకని కొంతసామాను ముందు చేరేసుకొని...

రా:-దాచిపెడ్దామంటావ్! తప్పుగదే_అన్నీ సమంగా పంచుకుందురుగాని అప్పచెల్లెళ్లు —

వి:-మీకు తెలియదుండండీ...ఇలా రండి. చెప్తాను. కాస్త చేతి సాయం చేద్దురుగాని...

(అని మేడమెట్లు ఎక్కుతున్న చప్పుడు.- అప్పుడే కూతురు జయతో పెద్దగా —)

వి:-ఏమే జయా! నువ్వు ఆ కిటికీ దగ్గరుండి ఎవరైనా వస్తుంటారేమో చూస్తూండు. అప్పుడు నన్ను పిలువ్. నువ్వు మాత్రం తలుపు తీయొద్దు, జాగ్రత్త!

(మేడమీదికి పోయిన శబ్దం)

[లోపల రామారావు దంపతులిద్దరూ కలిసి ఒక డ్రాయరూ, బీరువా, గడియారం — యిత్యాదులు కిందికిదింపుకొని వస్తూన్న శబ్దం - కొంచెంసేపు గడుస్తుంది]

వి:-ఏమండోయ్! మీ పాతచ్చెప్పులు తీసి అవతల పడేయండి. ఇవిగో మా నాన్న కొత్తచెప్పులు తొడుక్కోండి. ఇదిగో — ఈ శాలువాగూడా తీసికోండి.

రా:-నాకొద్దు. మీ నాన్నకన్నా ముందు మీ అప్ప నన్ను దయ్యమై పట్టుకుంటుందేమో —

వి:-భలే ధైర్యస్థులండి! మా నాన్న మనకిచ్చాడని చెబుదాం. తొడుక్కోండి చెప్పులు -

(చెప్పులు తొడుక్కుంటున్న శబ్దం)

వి:-వాళ్లొస్తే మీరేం మాట్లాడొద్దు. నాటకమంతా నే ఆడిస్తాను.

రా:-సరే (అని కుర్చీలో కూర్చున్న శబ్దం)

(జయ బైటనించి కేక — "అమ్మా అమ్మా — ఎవరోవస్తున్నారే" అని. విమల త్వరత్వరగా సర్ది ఏడుపుగొంతుతో వీధి తలుపులు తీసిన శబ్దం. కమలా, రాజారావూ వచ్చిన చప్పుడు.)

వి:-అక్కయ్యా! (అని లబోదిబో మంటూ ఏడుస్తుంది)

కమల:-ఏంచేస్తామే అమ్మయ్! (అని తనుగూడా ఏడుస్తుంది)

రాజారావు తిన్నగా దగ్గుతూ నడిచి వెళ్లి కుర్చీలో కూర్చున్నశబ్దం. విమలా, కమలా యిద్దరూ చెరోకుర్చీలో కూర్చున్న చప్పుడు)

క:-అయ్యో! ఏం రాత రాశాడే దేముడు! ఎలా పోయాడే నాన్న?

వి:-ఎలాఏముందీ._మూడు రోజుల్నించీ ఒకటేజ్వరం కడుపులో నొప్పన్నాడు.

రాజా:-డాక్టరుకు కబురు చేయలా.

వి:-ఆఁ. చేశాం - డాక్టరు చిదానందం గార్ని

రా:-ఆయనా! (అని చప్పరిస్తాడు)

వి:-మొదట్నించీ ఆయనే డాక్టరు మనకు. సరే వచ్చాడా_ఏవోయింజక్షన్లు యిచ్చాడు. జ్వరం తగ్గకపోగా పైగా సంధి పుట్టింది.

క:-ఆయనవల్ల కాకపోతే యింకోడాక్టర్ని పిలవలా?

వి:-తప్పకదే అట్లా చేయటం! అంతా ఒకరిచేతి మీదుగా సాగాలి. రెండో ఆయన్ని తెస్తే యీ యనికి కోపం రాదూ–

క:-కోపం వస్తుందని మనిషిని చంపుకుంటారటే!

వి:-నీకేం చెపుతావ్. ఒకరు 'ట్రీట్' చేస్తుంటే రెండో డాక్టరు రానే రాడు.

క:-రాకేం-నాలుగు డబ్బులు పారేస్తేసరి(రామారావునుద్దేశించి) ఏమయ్యా మరిదీ! దానికి లేకపోతే నీకైనా వుండొద్దుటయ్యా...

రా:-అవును...అవును...

క: ఏం అవునయ్యా! ఎక్కడో 'వైశంపాయనుడికి జనమేజయుడు దొరికినట్టు...

రా:-ఏమోయ్! నువ్వేం మాట్లాడవ్.

రా:-మాట్లాట్టానికేముంది? అది చెపుతోంది చాలదూ...

క:-ఇద్దరూ కలిసి చేతులారా నిండుప్రాణాన్ని పొట్టపెట్టుకున్నారు.

రా:-కాస్త ఓపిక పట్టు వదినా......

రా:-ఇంతకీ ఎట్లా చచ్చిపోయాడు -?

రా:-నేను మాట్లాడకుండానే మీ ఆవిడ పాఠం వప్పజెప్తుందిగా......

రా:-కాదులే. (భార్యతో) నువ్వు కాస్సేపూరుకోవే. (విమలతో) నువ్వు చెప్పు విమలా...

వి:-నిన్న రాత్రి నాన్న ధోరణి మరీ ఎక్కువైతే డాక్టరు కోసం కబురు చేశాను. ఈ లోపల నేను వంటింట్లోకి పోయి పాలకి కుంపటి వెలిగించాను. జయ నిద్రపోయింది........నాన్న గదిలోకి ఒకసారి పోయి చూద్దామని మేడమీదకిపోతే మంచం మీదలేదు. ఇల్లంతా వెదికాను. ఎక్కడాలేదు. దారిన పోయేవాళ్లనడిగాను. ఎవరో నదివేపు వెళ్తుంటే చూశామన్నారు...పరుగెత్తాను. అంతే-దూరాన ఏవో బుడగలు కనిపించినై. (అని ఏడుస్తుంది)

క:-ఇదేంచావే! అసలెక్కడికైనా వెళ్లాడో ఏమో. విచారించావా -

వి:-ఆయనకి ఎక్కడికీ వెళ్లే అలవాటులేదు.

రా:-బావుంది......

జయ:-(వస్తూ) భోజనాలైంతర్వాత మాట్లాడుకో వచ్చు పెద్దమ్మా...నాకాకలేస్తుంది –

వి:-వేస్తుంది-వేస్తుంది. తిన్ననోటికి తీపరం ఎక్కువ. ఇప్పుడా అన్నం! తాతయ్య చచ్చిపోయాడు...

జ:-అంటే ఏమిటమ్మా...

వి:-ముందుపోవే —

జ:-నా కాకలేస్తుందమ్మా.

వి:-పొమ్మంటే (అనిలోపలికి తీసికెళ్ళి తిరిగి వచ్చిన శబ్దం.)

క:-చిన్నది తెలియకడిగితే దాన్నలా కోప్పడాలా!...

(బీరువావైపు చూసి వుండబట్టలేక)

క:-విమలా! ఇది నాన్న బీరువాకదూ-కిందకెందుకు దింపారూ. ...

వి:-పోయిన సంక్రాంతికి యిది నాన్న ఆయనకిచ్చారు ...

క:-అదేమిటే. నాన్న మా దగ్గరున్నప్పుడు మా ఆయన్ని తీసుకోమన్నారు. ... ఏమండీ! ...

రా:-నాకో నీకోగాని – మొత్తానికి మనల్ని తీసుకోమన్నారు. ఈ అలమారగూడ చాలా బావుందే.

క:-అదా! అదీ మా నాన్నదేనండీ! (విమలతో) ఇదే పండక్కిచ్చాడమ్మా విమలా (అని ఎగతాళిగా అంటుంది.)

వి:-ఏపండక్కీకాదు-అలా చేతులు తిప్పుతూ అడక్కపోతే సరిగా అడగరాదూ ... చెబుతాను.

క:-చెప్పావులేమహా. అన్నీ బూటకపు మాటలూ నీవూనూ. ...

వి:-బూటకం చేయాల్సిన అగత్యం మాకేం పట్టిందీ! జయ వాళ్ల తాత దగ్గరకిపోయి "తాతా! ఆ అలమార నాకు కావా"లంది. "అలాగే తీసుకోమ్మా" అన్నాడు.

క:-అంటాడంటాడు —

వి:-అంటాడని తిన్నగ అంటూవేంటి? పర్సనల్‌గా ఆయని స్తేనే తీసుకున్నాం. మిగతావి పంచేసుకుందాం పద—

రా:-నువ్వు కాస్సేపూరుకోరాదు వదినా! వచ్చిందగ్గర్నుంచీ... మీ నాన్న వచ్చాడో లేదో అప్పుడే పంపకాలు. ...

క:-చాల్చాల్లేవయ్యా భలే చెప్పొచ్చావ్. ఆ బుద్ధి నీ పెళ్లానికి చెప్పుకో.

రా:-(మాట్లాడడు.)

రా:- నీకెందుకోయ్ మధ్య. అప్పా చెల్లెళ్లిద్దర్నీ పోట్లాడుకోనియ్. ఎవరిగొడవ వారిది. మనకెందుకు - చేతయితే చెరోకట్టా సప్లయ్ చేద్దాం.

క:-సామానంతా చూడాలి (మెట్లుఎక్కి తండ్రిగదిలోకిపోయి వచ్చిన చప్పుడు.) ఇంకేముంది! ఖాళీచేసిపెట్టారు. పంచుకోడాని కేముంది - బూడిదె.

వి:-ఆయనకి మేము చేసిన ఖర్చుకి సామాను తీసుకుంటే తప్పా ...!

క:-మేము మీకన్నా ఎక్కువే ఖర్చు చేశాం ...

వి:-వెండి బంగారాల్తో మేము ఆయన ఋణం తీర్చుకున్నాం. ...

క:-మాలో మీరు ఎన్నోవంతు చేశారు .. ఈ ఏణ్ణర్థం బట్టేగా మీ దగ్గరుంది. ...

వి:-నీ దగ్గరెన్నాళ్లున్నా డేంటి? అప్పుడు అమ్మే వుండేదిగా...! ఆయన మందుల కెంతయిందో తెల్సా?

క:-తిండికి మొహంవాస్తే జబ్బులొచ్చాయి, కాబోలు-

వి:-కాదూమరి! నీవు పెట్టేతిండెక్కువై ...

క:-చాల్లే వూరుకుంటున్నకొద్దీ, నువ్వు చేసిన పనులు కనపడుతూ నేవున్నై.

వి:-కాస్త ఆలోచించి మాట్లాడు —

క:-అంత తల తిక్కగా నేనేం మాట్లాట్టంలా. మీరే ... వచ్చేప్పటికి చేసే పనిచేసి ...

వి:-ఇక ఆట్టే వాగకు. మెడబెట్టి గెంటుతాను ఎవరింట్లో మాట్లాడుతున్నావో తెల్సా ...

(దగ్గుకుంటూ వృద్ధుని ప్రవేశం. తలుపు తెరచుకొని వచ్చిన శబ్దం.)

వృద్ధుడు:-(దగ్గ గంభీరంగా) ఆఁ ... తెలుసు.

జ:-అమ్మా! తాతయ్య వచ్చాడే.

వృ:-ఎందుకు అలా దెయ్యాన్ని చూసినట్టు చూస్తారు!

వి:-(రుద్ధకంఠంతో) నాన్నా! ఎక్కడికెళ్ళావ్ నాన్నా! జ్వరం తగ్గిపోయిందా? చెప్పు నాన్నా ...

వృ:కాస్సేపు వూపిరి తీసుకోనియ్యమ్మా ... హ్ ... అబ్బా ... (రాజారావుతో) ఏమండీ రాజారావుగారూ! మీరెప్పుడొచ్చారు ...

రా:-ఆఁ యిందాక నేనండి ...

వృ: ఎందుకు అంతా విచారంగా వున్నారు?

క:-ఏంలేదు నాన్నా ...

వృ:-ఏం లేదంటారేం. నేవచ్చేప్పటికి యింట్లో ఏదో పోట్లాట జరుగుతూంటే. ఏం విమలా! మాట్లాడవ్.

వి:-(మాట్లాడదు.)

వృ:-ఈ బీరువా, గడియారం - పైనుంచి కిందికి దించారేం - నాగదిలోవి.

క:-నువ్వు అన్నీ తలొకటి కానుకలిచ్చావుటగా —

వృ:-(ఆశ్చర్యంగా) నేనా! — నా కొత్త చెప్పులు రామారావు తొడుక్కున్నాడే —

రా:-క్షమించండి —

రా:-అంతేలెండి (నవ్వుతాడు)

క:-నాన్నా! ఇక్కడ వీళ్లతో నువ్వు వేగలేవు గాని, మాతోరా, పోదాం.

వి:-అంతా నాటకం నాన్నా. ...

క:-నాటకం! నాటకం నీది! నాన్న చచ్చిపోయాడని టెలిగ్రాం యివ్వడం - మేము వచ్చేప్పటికి సామాను సర్దుకోడం-కనిపిస్తూనేవుందిగా-చెప్పటం ఎందుకూ.

వృ:-ఆఁ... ఏమిటీ! నేను చచ్చిపోయానని టెలిగ్రాం యిచ్చారా ... ఏమోయ్ రామారావ్! ... ఏం నాటకం ఆడారయ్యా ఆస్తికోసం ...

వి:-నాన్నా ... (ఏడుస్తుంది.)

వృ:-ఛీ! నీ నాన్న ఎప్పుడో చచ్చిపోయాడు - కమలా! ఇదిగో తాళంచెవి. ఆ బీరువాతీసి దానిలోవున్న విల్ నామా తీసుకురా. పో. నేను ముందే రాసివుంచాను. ఆస్తిని రెండు భాగాలు చేసి ఒక భాగం - కమలకు - రెండో భాగం —

వి:-నాన్నా —

వృ:-జయకి - నాకు తెలుసు. విమలా రామారావుల పన్నాగం. నాకు సుస్తీగావుందనీ - ఎట్లాగూ బ్రతకడనీ-ఆ స్తికోసం జాగ్రత్తపడాలనీ ఏమేమో అనుకోడం - అందుకే యీ విల్లు ముందే రాసి వుంచాను.

(వృద్ధుడు పోతాడు)

వి:-నాన్నా! (అని క్రిందపడుతుంది.)

[ఆల్ ఇండియా రేడియో ప్రసారితం]

ట్యూబులలో ఎందుకు
సీసాలలో కాకుండాను ?

★ దినుసులు పరిశుద్ధముగాను చురుకుగాను ఉండును.
★ మలినము కాజాలవు.
★ వలసినంత తీసికొన వీలగుటచే ఆటివచ్చుట రూఢి.



నోపెయిన్ బామ్

శుభ్రముగా సీలు వేయబడిన ట్యూబులలో

తలనెప్పి, కండరముల నెప్పులు, గుండె జలుబులకు

కలకత్తా కెమికల్ వారి వస్తువు.

CF 32 TL 55

“సౌత్ ఇండియా ఆఫీసు :5/149, బ్రాడ్వే, మద్రాసు 1.”